ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు



గురువారం 25 జనవరి 2024



రాజధాని రైతుల భారీ ర్యాలీ (పాతచిత్రం)



రాజధాని గ్రామాల్లో కొత్త కాంతులు

మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానుండడంతో రాజధాని గ్రామాల్లో కొత్త వెలుగులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మారుతుం దన్న సంకేతాలతో ఇప్పటి వరకు కోల్పోయిన సంతోషం రాజధానివాసుల్లో తిరిగి వచ్చినట్లనిపిస్తోంది. రాజధాని భూముల ధరల్లో కనిపిస్తోన్న పెరుగుదల.. నాలుగున్నరేళ్ల క్రితం ఆగిపోయిన స్థలాల క్రయ, విక్రయాలు తిరిగి తెరమీదకి రావడంతో రైతు ల్లో కొత్త ఆశలు చిగురి స్తున్నాయి. టీడీపీ, జనసేన అధినేతలు ఇరు వురూ మందడం గ్రామంలో 'భోగి సంకల్పం' చేపట్టడం.. వచ్చే ఏడాది ఇదే రాజ దానిలో సంక్రాంతి సంబరాలు అధికా రికంగా జరుపుకుంటా మని, ప్రజా రాజధాని అమరావతి నుం చే రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ పాలన అందిస్తానని చంద్ర బాబు చేసిన హామీ వారి స్థైర్యాన్ని పెంచింది. బంగా రంలాంటి రాజధానిని నిర్మించు కుందాం అంటూ జనసేనాని పవన్ ఇచ్చిన హామీ వారి సంతోషాన్ని రెట్టింపు చేసింది.



మందడంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్

మొక్కవోని.. మహోద్యమం





అజరామరంగా అభివృద్ధి చెందాల్సిన అమరావతి పోరుబాటలో అలుపెరగకుండా సాగుతోంది. భూ ములు ఇచ్చి అభివృద్ధి ఫలాలను అనుభవించాల్సిన రైతులు సమరం సాగిస్తోన్నారు. గత పాలకుల కంటే మిన్నగా అమరావతిని అభివృద్ధి చేస్తామని గద్దెను ఎక్కి మూడు రాజధానులంటూ అమరావతి ని పాడుపెట్టిన వైసీపీ ప్రభుత్వంపై రైతులు, మహిళ లు మొక్కవోని దీక్షతో మహోద్యమం చేస్తోన్నారు. రోజులు కాలగమనంలో కరిగిపోతుండగా అన్యాయంపై రాజధాని రైతులు, బహుజనులు, కూలీలు సాగిస్తున్న సమరం అజరామరంగా సాగిపోతూనే ఉంది. పండుగలు.. పర్వదినాలు.. ఉత్సవాలు.. సంబరాలు అన్నీ దీక్షా శిబిరాల్లోనే. పోలీసుల లాఠీ లు.. కేసులు.. అరెస్టులు.. పాలకుల సూటిపోటి మాటలు.. వేధింపులకు వెరవకుండా అలుపె రగకుండా పోరు సాగిస్తున్నారు. ఎన్ని ఆటుపోట్లు.. ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా అమరావతి రైతులు సాగిస్తున్న పోరాటం 1500వ రోజుకు చేరింది. అమరావతి ఉద్యమాన్ని ఎలాగైనా అణచి వేయాలని పాలకుల పన్నాగాలు, కుట్రలను వమ్ము చేస్తూ అంతకంతకూ బలంగా అమరావతి ఉద్య మం ముందుకు సాగుతూనే ఉంది.

అమరావతి పోరుకు 1500 రోజులు

- రాజధాని ఉద్యమంలో మరో మైలురాయి
- లాఠీలు, మాటల తూటాలకు తలొగ్గని పోరాటం
- వేల మందిపై కేసులు, వందల మంది అరెస్టులు
- సానుకూల పరిణామాలతో రైతుల్లో కొత్త కాంతులు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమరావతి పోరు.. మహోజ్వల భవిష్యత్ కోసం మట్టి మనుషులు చేసిన మహా పోరాటమది. నమ్మించి గొంతు కోసిన పాలకులపై అలుపెరుగని రణమది. రైతుల త్యాగాలు, ఆత్మ బలిదానాలతో అమరావతి ఉద్యమం అజరామరంగా సాగుతూ గురువారంతో మరో మైలురాయిని చేరింది. రాజధాని రైతులు, మహిళలు, రైతుకూలీలు, దళిత బహుజనులు, మైనారిటీలు ఏకమై మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. పోలీసుల నిర్బంధాలు, కవాతులు, లాఠీల కరాళ నృత్యాలు, రక్తమోడుతున్న గాయాలు.. వారి పోరాట పటిమను దెబ్బతీయలేకపోయాయి. అందుకే 1500 రోజులుగా ఆ మహా మహోద్యమం మరిచిపోలేని విజయాలతో ముందుకు సాగుతూనే ఉంది. దేశ చరిత్రలోనే ఇంత సుదీర్ఘకాలం పాటు క్రియాశీలకంగా సాగిన ఉద్యమం మరొకటి లేదంటే అతిశయోక్తి కాకపోవచ్చు. రాజధాని నిర్మాణంపై ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న వారికి 2019 డిసెంబరు 17న ముఖ్యమంత్రి జగన్ శాసన సభలో చేసిన మూడు రాజధానుల ప్రకటన భూములిచ్చిన రైతులను కుదిపేసింది. ఆ మర్నాటి నుంచే రాజధాని ఉద్యమం మొదలైంది. తొలుత రాజధాని గ్రామాలైన తుళ్లూరు, మందడం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం గ్రామాల్లో మొదలైన ఉద్యమం క్రమంగా అన్ని గ్రామాలకు విస్తరించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సాగుతున్న రైతుల ఉద్యమానికి అధికార వైసీపీ మినహా మిగిలిన పార్టీలన్నీ సంఘీభావం ప్రకటించాయి. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్, అప్పటి బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, సీపీఐ, సీపీఎం కార్యదర్శులు రామకృష్ణ, మధు తదితరులు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు అండగా నిలిచారు. కరోనా లాక్‌డౌన్‌లోనూ రైతులు నిరసనలు, దీక్షలను కొనసాగించారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

1500 రోజుల మైలురాయిని చేరిన అమరావతి మహోద్యమం రాష్ట్ర చరిత్ర లోనే కాదు, దేశ చరిత్రలోనే నిలిచిపోయే ఉద్య మంగా కీర్తిగడించింది. మహిళలు స్నానం చేస్తున్న సమయంలో స్నానపు గదులపై డ్రోన్ కెమేరాలను తిప్పడాన్ని అడ్డుకున్నందుకు 40 మందిపై కేసులు నమోదు చేసి 20 రోజులపాటు జైలుపాలు చేశారు. మొత్తం ఉద్యమ క్రమంలో 2500 మందిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. 1500 రోజుల ఉద్యమకాలంలో దాదాపు 250 మంది ఉద్యమకారులు అశువులు బాశారు. రెండు రోజుల క్రితం దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ లూథర్ గుండెపోటుతో చనిపోవడం రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తొలిరోజు ఎంత బలంగా మొదలైందో నేటికీ అదే బలంతో ముందుకు సాగుతోంది.

నేడు మందడం, వెలగపూడిలో కార్యక్రమాలు

తుళ్లూరు: అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తోన్న ఉద్యమం గురువారం నాటికి 1500వ రోజుకు చేరుకున్న సందర్భంగా మందడం, వెలగపూడిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మందడం పోలేరమ్మ గుడి ఆవరణలో ఉద్యమ కార్యక్రమాలకు వేదికను ఏర్పాటు చేశారు. వెలగపూడి ధర్నా శిబిరం ఎదురుగా ఉన్న స్థలంలో మరో వేదిక ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలకు వైసీపీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నేతలను, దళిత, ముస్లిం మైనార్టీ, రైతు సంఘాల నేతలను అమరావతి జేఏసీ ఆహ్వానించింది. రాబోయే రోజుల్లో ఉద్యమ కార్యాచరణపై నాయకులు ప్రసంగించనున్నారు. రాజధాని 29 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని జేఏసీ నాయకులు పిలుపు ఇచ్చారు.

అపూర్వ ఘట్టాలు..

మూడు రాజధానుల ప్రకటనకు వ్యతిరేకంగా 2019 డిసెంబరు 19న రాజధాని రైతులు బంద్‌కు పిలుపు ఇవ్వగా వారికి మద్దతుగా గుంటూరు, విజయవాడతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. అనూహ్య స్పందనతో ప్రభుత్వం 30 యాక్ట్, 144, సెక్షన్లతో రాజధాని గ్రామాలను తన గుప్పిట బంధించింది. వందలాదిమంది పోలీసులు రాజధాని గ్రామాల్లో కవాతులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అయినా ఉద్యమం ఆగలేదు.

- 2020 జనవరి 3న ఉద్యమం చేస్తున్న అమరావతి మహిళలపై పోలీసులు దాడి చేశారు. దీనికి నిరసనగా రాజధాని గ్రామాలు బంద్ నిర్వహించాయి.
- 2020 జనవరి 10న దుర్గమ్మకు ముడుపులు చెల్లించుకునేందుకు వెళుతున్న మహిళలపై పోలీసులు దాడి చేశారు. గుంటూరు ఎస్పీ విజయరావు లాఠీలతో మహిళలపై విరుచుకుపడ్డాడు.
- 2020 జనవరి 20న అమరావతి జేఏసీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ ముట్టడిని భగ్నం చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చేయని ప్రయత్నం లేదు. పోరాటంలో రైతులు, మహిళలపై జరి గిన అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు.
- 2020 ఏప్రిల్ 7న జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు.
- జూలై 4న 200వ రోజు సందర్భంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో రైతులకు సంఘీభావంగా ప్రజలు దీక్షలు చేపట్టారు.

200 నగరాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

- అక్టోబరు 12న 300 రోజు సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన రైతులకు నివాళిగా తుళ్లూరులో రాజధాని గ్రామాల రైతులు 'ఆత్మబలిదాన యాత్ర' పేర భారీ ప్రదర్శన నిర్వహించారు.
- డిసెంబరు 31న 'చలో గుంటూరు జైలు' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను పోలీసులు ఈడ్చి పారేశారు.
- 2021 జనవరి 20న 400 రోజు సందర్భంగా రైతులు చేపట్టిన 'రాజధాని సంకల్ప ర్యాలీ' నిర్వహించారు.
- 2021 నవంబరు 1 చేపట్టిన న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్ర ఉద్యమ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది. 57 రోజుల పాటూ సాగిన ఈ సుదీర్ఘ పాదయాత్రలో రైతులు వందల మైళ్లు నడుచుకుంటూ స్వామివారి సన్నిధి చేరుకున్నారు.
- 2022 ఫిబ్రవరి 24న 800వ రోజు సందర్భంగా రాజ ధాని రైతులు అమరావతి ప్రజాదీక్ష పేరుతో దీక్ష చేపట్టారు. 24 గంటల నిరసన దీక్షలో 800 మంది, 12 గంటల దీక్షలో 2000 వేల మంది పాల్గొని నిరాహార దీక్ష చేశారు.
- 2022 సెప్టెంబరు 12కి అమరావతి ఉద్యమం మొదలై వెయ్యి రోజులు పూర్తయింది. ఆ సందర్భంగా అమరావతి టూ అరసవిల్లి పేరిట 630 కిలో మీటర్ల మేర మహాపాదయాత్రకు రైతులు శ్రీకారం చుట్టారు. పోలీసుల నిర్బంధాలు, వైసీపీ మూకల దౌర్జన్యాలను ఎదుర్కొంటూ రైతులు పాదయాత్ర కొనసాగించారు.
- 1300 రోజుకు చేరిన సందర్భంగా 2023 జూలై 9న అమరావతి రాజధాని ఐక్య కార్యచరణ సమితి, అమరావతి పరిరక్షణ సమితి సంయుక్తంగా 'నాలుగేళ్ల నరకంలో నవనగరం' కార్యక్రమం నిర్వహించారు.
- అక్టోబరు 17 నాటికి 1400 రోజులకు చేరింది. ఆ సమయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ కేసుల్లో అరెస్టై రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నారు. దీంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం, రాజధాని సృష్టికర్త చంద్రబాబు విడుదల కోసం తుళ్లూరు దీక్షా శిబిరంలో గాయత్రి, గణపతి, నవగ్రహ, కాల భైరవ, చండీ హోమాలు నిర్వహించారు.



మూడు రాజధానుల జీవో ప్రతులను తగలబెడుతూ..



రాజధాని మహిళలపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు



రైతుల జలదీక్ష



అమరావతి మహిళల పోస్టు కార్డుల ఉద్యమం



పొలాలు ఇచ్చిన రైతులపై లాఠీ ప్రయోగం

చీరాల నుంచే.. పోటీ చేస్తా..

అంతరంగిక సమావేశంలో ముఖ్య నేతలతో ఆమంచి



చీరాల, జనవరి 24: తాను చీరాల నుంచే పోటీ చేస్తానని పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ప్రకటిం చారు. రెండు రోజుల క్రితం చీరాలలో జరిగిన వైసీపీ బస్సు యాత్రలో చీరాల నుంచి వైసీపీ అభ్యర్థిగా కరణం వెంకటేశ్ పేరును నాయకులు ప్రకటించగా ఆయనకు లైన్‌క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో గత ఒప్పందాలను మననం చేసేం దుకు వెంటనే సీఎంవోలో ముఖ్య నాయకులను ఆమంచి కలిశారు. అయితే అక్కడ పార్టీ పెద్దలు ఆమంచి వాదనతో ఏకీభవించలేదని సమాచారం. దీంతో ఆమంచి తాను పర్చూరులో కొనసాగేది లేదని, పార్టీ, ఇండిపెండెంట్ అన్నది పక్కన పెడితే చీరాల నుంచే పోటీ చేస్తానని, ఆ విష యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్యనాయకు లతో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం రాత్రి ఆమంచి తన రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో ము ఖ్య నాయకులతో అంతరంగికంగా సమావేశం నిర్వహించి పోటీ విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. సీఎం జగన్ తనకు మధ్య జరిగిన చర్చలను కూడా త్వరలో వెల్లడిస్తానని చెప్పినట్లు సమాచారం.

పాత ఫార్ములాను ప్రయోగించే ఆలోచన

ఆమంచి తన పాత ఫార్ములాను ప్రయోగించే ఆలోచనలో ఉన్నాడా అంటే.. సన్నిహితుల నుంచి అవుననే సమాధానమే వస్తుంది. 2009లో చీరాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన ఆమంచి 2014 ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. ఎన్నికల ప్రచారంలో గెలిచిన తర్వాత టీడీపీలోకి వస్తానని కొందరికి, వైసీపీలోకి వస్తానని మరికొందరికి చెప్పగా అనూహ్యంగా ఆమంచి గెలుపొందారు. ఆ తర్వాత ఆమంచి టీడీపీలో చేరారు. టీడీపీలో ఇమడలేమంటూ 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీలో చేరి పోటీ చేయగా ఓడిపోయారు. ఈ పరిస్థితుల్లో 2014 ఎన్నికల ఫార్ములాను 2024 ఎన్నికల్లో ఉపయోగించి గెలుపొందాలన్నది ఆమంచి వ్యూహంగా తెలుస్తోంది. అందుకే తాను చీరాల నుంచే పోటీ చేస్తాననే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ముఖ్య నాయకులకు చెప్పినట్లు భావిస్తున్నారు. అయితే కృష్ణమోహన్‌కు గత ఎన్నికల్లో తోడుగా ఉన్న సోదరుడు ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) వెంట లేడు. ఆయన జనసేన పార్టీలో చేరారు.

మాట వినలేదని.. వేధింపులు

- అధికారుల తీరుతో అంగన్‌వాడీల అవస్థలు
- తాళాలు ఇవ్వకపోవడంతో తెరుచుకోని కేంద్రాలు
- పౌష్టికాహారం పంపిణీ చేయలేకపోతున్న ఆయాలు
- రెండు రోజులుగా ఆరుబయటే విధులు నిర్వహిస్తున్న వైనం

బాపట్ల, జనవరి 24: సమ్మె కాలంలో తమ మాట వినలేదని, చెప్పిన పని చేయలేదని, కేంద్రాల తాళాలు అడిగినప్పుడు ఇవ్వలేదని అంగన్‌వాడీలపై ఐసీడీఎస్ అధి కారులు, సచివాలయ ఉద్యోగుల కక్షసాధింపు చర్యలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. సమ్మె అనంతరం ఆంగన్‌వాడీలు విధుల్లో చేరినా రెండో రోజు బుధవారం కూడా కేంద్రాల తాళాలను ఆయాలకు సచివాలయ ఉద్యోగులు ఇవ్వలేదు. దీంతో ఆరు బయటే కూర్చొని వారు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాళాలు లేకపో వడంతో కేంద్రాల్లోని పౌష్టికాహారం పంపిణీ చేయలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పౌష్టి కాహారం లేకుండానే చిన్నారులు వెనుతిరగా ల్సి వస్తోంది. ఇందుకు ఐసీడీఎస్, సచివాలయ ఉద్యోగుల తీరు కారణమని అంగన్ వాడీలు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సమ్మె చేసి మీ తడాఖా చూపించారు.. ఇప్పు డు మా తడాఖా చూపిస్తామంటూ కొంతమంది అధికారులు అంగన్‌వాడీలతో అంటున్నారు. గట్టిగా ప్రశ్నిసే ఐసీడీఎస్ అధికారుల వద్ద జాయినింగ్ లెటర్ తెచ్చుకుంటేనే తాళాలు ఇస్తామని చెబుతున్నారని సమాచారం. దీనిపై గ్రామస్తులు, చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడుతామని సచివాలయ ఉద్యోగులు బెదిరిస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. దీంతో చేసేదిలేక రెండురోజులుగా ఆయా కేంద్రాల వద్దకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు వచ్చి యాప్‌లో హాజరు పెట్టి సాయంత్రం వరకు ఉండి వెళుతున్నారు. దీనిపై పీడీ సైతం నోరు మెదపకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులను బతిమిలాడి పడిగాపులు కాచి తాళాలు తెచ్చుకున్నారు.



రెండో రోజూ ఆరుబయటే విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అద్దంకిలో టీడీపీకి అనుకూలంగా..

- మారుతున్న సమీకరణలు
- సంతమాగులూరు నేతలు ఎమ్మెల్యేతో భేటీ
- పార్టీ మారేందుకు వైసీపీ కీలక నేతలూ సిద్ధం

అద్దంకి, జనవరి 24: అద్దంకి నియోజకవర్గంలో సమీకరణలు టీడీపీకి అనుకూలంగా వేగంగా మారుతున్నాయి. సంతమాగులూరు మండలానికి చెందిన కీలక నేతలు ఇప్పటికే ఎమ్మెల్యే రవికుమార్‌తో సమావేశమయ్యారు. రెపో మాపో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. బల్లికురవ, కొరిశపాడు మండలాలతో పాటు అద్దంకి పట్టణంలోని పలువురు వైసీపీలోని కీలక నేతలు కూడా టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇక ఇప్పటికే గ్రామస్థాయి వైసీపీ నేతలు అయితే చిలకలూరిపేటలో ఎమ్మెల్యే రవికుమార్‌ను వ్యక్తిగతంగా కలిసి టీడీపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారు.అయితే ఎమ్మెల్యే రవికుమార్ తన వద్దకు వచ్చిన నేతలతో సమావేశం అవుతూనే ఆయా గ్రామాల టీడీపీ నేతలతో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండే విధంగా సమన్వయం చేసుకునే పనిలో ఉన్నారు. రెండు మూడు రోజుల్లో సంతమాగులూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అట్లా చినవెంకటరెడ్డి, ఎంపీపీ యలమందతో పాటు మండలం లో సగానికి పైగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర నేతలను చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి ఆహ్వానించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంగులూరు మండలంలో వైసీపీలో కీలక నేతలుగా ఉన్న నాయకులు టీడీపీలో చేరేందుకు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. మార్టూరు, అద్దంకి నియోజకవర్గాలలో పోటీ చేసి ఉండటంతో అత్యధిక శాతం మంది నేతలతో రవికు సంబంధాలు ఉన్నాయి. ఇలా ఉన్న వ్యక్తి గత సంబంధాలు ప్రస్తుతం గ్రామస్థాయి నేతలను నేరుగా కలిసేందుకు ఆయనకు దోహదపడుతున్నాయి. కండువాలు కప్పుకుని ప్రచార ఆర్భాటాలు అవసరం లేదని, ఎన్నికలలో కష్టపడి పనిచేసి టీడీపీకి అత్యధిక మెజార్టీ తీసుకువచ్చేవిధంగా పనిచేయాలని వారికి రవి సూచిస్తున్నారు.



ఎమ్మెల్యే రవితో చర్చిస్తున్న సంతమాగులూరు మండల వైసీపీ నేతలు (ఫైల్ ఫొటో)

థగ్‌లైఫ్ షూటింగ్ మొదలైంది..



కమల్‌హాసన్ ఎంత గొప్ప నటుడో అంత స్టార్ కూడా. స్టార్‌గా ఆయన స్టామినాకు 'విక్రమ్' విజయమే నిదర్శనం. 120 కోట్ల నిర్మాణ వ్యయంతో రూపొందిన 'విక్రమ్' దాదాపు 500కోట్ల వసూళ్లను రాబట్టింది. త్వరలో 'భారతీయుడు2'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు కమల్. ఇక ఆయన రీసెంట్‌గా ఓకే చేసిన క్రేజీ ప్రాజెక్ట్ 'థగ్‌లైఫ్'. మణిరత్నం ఈ సినిమాకు దర్శకుడు. 36ఏళ్ల క్రితం కమల్, మణిరత్నం కలయికలో వచ్చిన 'నాయకుడు' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. సదరన్ టాప్ 10 కల్ట్‌మూవీస్‌లో అగ్రస్థానంలో 'నాయకుడు' ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కమల్, మణిరత్నం చేతులు కలిపారు. అనౌన్స్‌మెంట్‌తోనే దేశవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్ చర్చనీయాంశమైంది. ఇదిలావుంటే.. బుధవారం ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ ఓ వీడియోను విడుదల చేశారు. దుల్కర్‌సల్మాన్, జయంరవి, గౌతం కార్తీక్, జోజు జార్జ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి ఇందులో ప్రధాన పాత్రలు పోషించనున్నట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అంచనాలున్న ఈ చిత్రాన్ని మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్‌తో కలిసి కమల్‌హాసన్ నిర్మిస్తున్నారు. ఉదయనిధి స్టాలెన్ సమర్పకుడు. ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.



నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ

సుహాస్

సుహాస్ హీరోగా రూపొందిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'కొన్ని రియలిస్టిక్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ సినిమాను రూపొందించాం. లవ్‌స్టోరీతో పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. ఊరిలో జరిగే కథ కనుక కులాల ప్రస్థావన ఉంటుంది. అయితే ఎవరినీ కించేపరిచే అంశాలు ఇందులో ఉండవు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అన్నారు. 'నేను నిర్మాతగా మీ ముందు నిలబడడానికి అల్లు అరవింద్, బన్నీ వాస్‌గార్లు కారణం. ఈ చిత్రకథ వినగానే బన్నీ వాసుగారు చాలా ఎగ్జైట్ అయ్యారు. సుహాస్ కూడా చాలా ఇన్వాల్వ్ అయ్యాడు. ఈ సినిమా కోసం రెండు సార్లు గుండు చేయించుకున్నాడు. హీరోయిన్ శివానీ, శరణ్య ప్రదీప్ తదితరులు అద్భుతంగా నటించారు. మా ఛాయాగ్రాహకుడు వాజిద్ అమలాపురం ప్రాంతాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మంచి ట్యూన్స్ ఇచ్చారు. హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు నిర్మాత ధీరజ్. చివరిగా హీరో సుహాస్ మాట్లాడుతూ 'నిన్ననే నాకు బాబు పుట్టాడు. ఆ హ్యాపీలో ఉన్నా. అలాగే ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నా. నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్ మూవీ. సినిమా చూస్తున్నప్పుడు మీ జీవితంలో జరిగిన సందర్భాలను గుర్తు చేసుకుంటారు' అన్నారు.



ఎన్‌డీఎఫ్‌కు రామ్ విరాళం

దేశభక్తి కథాంశంతో రూపొందిన 'రామ్' (ర్యాపిడ్ యాక్షన్ మిషన్) చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. మిహిరామ్ వైనతేయ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్య అయ్యలసోమయాజుల హీరోగా, ధన్య బాలకృష్ణ హీరోయిన్‌గా నటించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ 'మంచి కంటెంట్‌తో వస్తున్న సినిమా ఇది. నేను కొంత రషెస్ చూశా. ఎన్నో ఇబ్బందులు పడి చిత్రాన్ని తీశారు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. అలాగే ఈ సినిమా కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'దేశభక్తిని చాటి చెప్పే ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది' అన్నారు. 'బోర్డర్‌లో ఉన్న సైనికుల గురించే కాకుండా టెర్రరిస్టుల నుంచి మనల్ని కాపాడే అన్‌సంగ్ హీరోల గురించి కూడా ఈ సినిమాలో చూపించాం. మాకు థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. అయినా మా పంపిణీదారుడు గణేశ్ మంచి థియేటర్ల కోసం ప్రయత్నిస్తున్నారు' అన్నారు దర్శకుడు మిహిరామ్. ఈ సినిమాకు తెగే ప్రతి టికెట్‌లో ఐదు రూపాయలను నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తామని నిర్మాత దీపికాంజలి చెప్పారు.

జాలీ రైడ్‌కు వెళ్లిన అనుభూతి కలుగుతుంది

శివ కార్తికేయన్



శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా రూపొందిన 'అయలాన్' చిత్రం ఈ నెల 12న సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో విడుదలై విజయం సాధించింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 26న గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ద్వారా మహేశ్వర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో బుధవారం కార్తికేయన్ ముచ్చటించారు

- దర్శకుడు రవికుమార్ విజన్ 'అయలాన్'. సినిమాలో 4500 వి.ఎఫ్.ఎక్స్ షాట్స్ ఉన్నాయి. పరిమిత నిర్మాణ వ్యయంతో సినిమా తీయగలిగితే మరింత పెద్ద కలలు కనవచ్చు.. అనిపించింది. అందుకే ఎక్కువ రోజులు పట్టినా ఈ సినిమానే చేయాలని నిర్ణయించుకున్నా.
- యూనివర్సల్ కాన్సెప్ట్ ఉన్న చిత్రమిది. హ్యూమన్, ఏలియన్ మధ్య ఇంటరాక్షన్ అన్ని ప్రాంతాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. ఇది సినిమాలా ఉండదు. థీమ్ పార్క్‌లోకి వెళ్లి జాలీ రైడ్ చేసిన అనుభూతి కలిగిస్తుంది. మా సినిమా తమిళనాడులో భారీ విజయం సాధించింది. తెలుగులో కూడా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది.
- రూ. 200, 300 కోట్ల బడ్జెట్ ఉంటే తప్ప ఇటువంటి సినిమా చేయలేమని చెబుతారు. అయితే సరైన టీమ్, ప్లానింగ్ ఉంటే తక్కువ బడ్జెట్‌లో కూడా తీయవచ్చు. ఇది హిట్ అయితే ఎక్కువ బడ్జెట్ ఇవ్వడానికి నిర్మాతలు ముందుకు వస్తారు. అయలాన్‌లో 90 శాతం గ్రాఫిక్స్ ఉన్నాయి. 70 శాతం సినిమాలో ఏలియన్ ఉంది.
- ఈ సినిమాకు సీక్వెల్ ఐడియా ఉంది. ఏలియన్‌ను క్రియేట్ చేయడానికి చాలా రిసెర్చ్ చేశాం. ఎక్కువ టైమ్ స్పెండ్ చేశాం. సీక్వెల్‌ను ఇంతకంటే బిగ్గర్ స్కేల్‌లో చేస్తాం.
- రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో కమల్‌హాసన్ సార్‌తో కలిసి నటిస్తున్నాను. 'ఎస్‌కే21' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం 80 శాతం పూర్తయింది. ఇందులో నేను, సాయిపల్లవి కలసి నటిస్తున్నాం. వేసవిలో విడుదల కావచ్చు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZiFDQlr లో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

అడ్వెంచరస్ కెరీర్ ఫోరెన్సిక్ సైన్స్

సోనీ టెలివిజన్‌లో కొన్నేళ్లుగా అలరిస్తున్న దారావాహిక సీఐడీ. అందులో తప్పనిసరిగా ల్యాబ్ టెస్ట్ ఉంటుంది. వాస్తవానికి ఒక ఎపిసోడ్‌కు అవసరమైన క్లూ అక్కడే లభ్యమయ్యేది. నేరగాళ్లను పట్టుకోవడం ఒక ఎత్తు అయితే, దాన్ని సశాస్త్రీయంగా నిరూపించడంలో ప్రధాన పాత్ర వహించేది ల్యాబ్. నేరస్థలం వద్ద సేకరించిన వస్తువులను శాస్త్రీయంగా పరిశీలించడం, నిజాన్ని రాబట్టేందుకు అవసరమైన సాక్ష్యాన్ని ధ్రువీకరించడం అన్నవి రెండూ అక్కడ జరుగుతాయి. వస్తువుల సేకరణ నుంచి శాస్త్రీయంగా నేర ధ్రువీకరణ వరకు జరిగే వ్యవహారం అంతటినీ ఒక మాటలో చెప్పాలంటే ఫోరెన్సిక్ సైన్స్ అనవచ్చు.

➡ 'ఫోరమ్' అనేది లాటిన్ పదం. పది మంది ఒక చేట చేరి, చర్చించి ఒక నిర్ధారణ లేదా నిర్ణయానికి రావడంగా ఈ పదానికి అర్థం చెప్పుకోవచ్చు. దానికి శాస్త్రీయతను జోడించినప్పుడు అది ఫోరెన్సిక్ సైన్స్ అవుతుంది. లీగల్, సివిల్, క్రిమినల్, నియంత్రణ, చట్టబద్ధతకు సంబంధించిన విషయాలను నిర్ధారించేందుకు రెండు రకాల సాక్ష్యాలు ఉపకరిస్తాయి. అందులో మొదటిది వ్యక్తులు చెప్పేవి. చిన్న పిల్లలు అబద్ధం చెప్పరన్న నమ్మకంతో వారి సాక్ష్యానికి విలువ ఇస్తున్నారు. మహిళలు, వృద్ధుల చెప్పేదానికి ఒక మేర విలువ ఉంది. అయితే, ప్రలోభాలకు గురై మాటకు కట్టుబడకపోవడం, కోర్టుకు వచ్చేటప్పటికి వాంగ్మూలాన్ని మార్చేయడం అన్నది ఎప్పటి నుంచో ఈ సమాజంలో ఉంది. ఫలితంగా మానవుల సాక్ష్యం హేతుబద్ధతకు నిలవటం లేదు. రెండోది శాస్త్రం సహకారంతో పక్కాగా సాక్ష్యాన్ని ముందుంచడం. శాస్త్రీయ పరిజ్ఞానం, అవగాహన పెరిగిన దరిమిలా ఏదైనా విషయాన్ని సైంటిఫిక్‌గా రుజువు చేసే అవకాశం కలుగుతోంది. డిఎన్ఎ పరీక్ష, పాలిగ్రాఫ్, వాయిస్(మాట) అలాగే ఇమేజ్(చిత్రం) ఐడెంటిటీ తదితరాలు ఇందులోకి వస్తాయి. భౌతిక సాక్ష్యాలను పరిశీలించి నేర నిర్ధారణ జరుగుతుంది. ఇంటర్నెట్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఆ రకంగానూ నేరాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో నేర నిరూపణకు శాస్త్ర వినియోగం పెరిగింది. సాధ్యమైనంత వరకు శాస్త్రీయంగా నిరూపించడం ద్వారా వివిధ కేసులను సముచితంగా పరిష్కరించే వీలు న్యాయ వ్యవస్థకు లభిస్తోంది.

➡ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో క్రిటికల్ ఎలిమెంట్ ఫోరెన్సిక్ సైన్స్. ఈ సైంటిస్టులు సాధారణంగా క్రైమ్ సీన్ నుంచి సేకరించిన ఎవిడెన్స్‌ను విశ్లేషిస్తారు. ఇన్వెస్టిగేషన్, తదుపరి ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారాన్ని అందిస్తారు. తద్వారా అసలు దోషులను పట్టిస్తారు. అమాయకులను బైటపడేస్తారు. అలా నేర నిర్ధారణలో ఫోరెన్సిక్ సైన్స్ ఈ రోజుల్లో కీలకపాత్ర పోషిస్తోంది.

➡ మెడిసిన్, ఇంజనీరింగ్ కాకుండా మరేదైనా మంచి కోర్సు చేయాలనుకుంటే ఫోరెన్సిక్ సైన్సెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. సాహసాలు చేయాలనుకునే యువత ఎంచుకోదగ్గ కోర్సు. అడుగడుగున థ్రిల్ కలిగిస్తుంది. ఎథికల్ హ్యాకింగ్‌తో మొదలుపెట్టి ఇంటెలిజెన్స్ సర్వీసులు అంటే ఇంటెలిజెన్స్ బ్యూరో, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, సీఐడీ, సీబీఐ అది కాదంటే ప్రైవేటు డిటెక్టివ్‌గా పనిచేయాలంటే ఫోరెన్సిక్ సైన్స్ చదవడం అభిలషణీయం అవుతుంది. ఇక్కడ పేర్కొన్న వాటిలో కొన్నింటిలో కుదురుకునేందుకు యూపీఎస్సీ ఎగ్జామ్‌ను ఎదుర్కోవాలి. మరికొన్నింటికి వేరే మార్గాలు ఉన్నాయి.



➡ విశ్లేషణ అలాగే క్రైమ్ సంబంధిత డేటాను ఇంట్రప్రెటేట్ చేసేందుకు కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ సమాచారాన్ని ఉపయోగించాలి. మొత్తమ్మీద చట్టాన్ని అమలు చేసే సంస్థలకు ఉపయోగపడేలా ఉండాలి. ముఖ్యంగా ఇందులో నిలదొక్కుకోవాలంటే బయాలజీ, కెమిస్ట్రీ, సైకాలజీపై పట్టు ఉండాలి.

కోర్సులు: ఎంబీబీఎస్ తదుపరి ఎండీ ఫోరెన్సిక్ సైన్స్ చేస్తే ఈ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు. పెద్ద ఆసుపత్రుల్లో జరిగే శవపరీక్షలో పాల్గొనాల్సి ఉంటుంది. తద్వారా నేర నిరూపణకు శాస్త్రీయంగా సమాచారాన్ని ఇవ్వవచ్చు.

➡ ఎక్కువ మంది సులువైన మార్గం అంటే మూడేళ్ల బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ చదువుతారు. మరికొందరు ఆపై పీజీ కూడా చేస్తారు. దేశవ్యాప్తంగా పలు సంస్థలు ఈ కోర్సులను అందిస్తున్నాయి. డీఎన్ఏ ప్రొఫైలింగ్, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణ, రక్తపు మరకల విశ్లేషణ, సలైవా అండ్ బోన్ అనాలిసిస్‌కు తోడు క్రిమినల్ జస్టిస్‌ను కూడా చదవాల్సి ఉంటుంది. పీజీలో చాలా స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. ఫోరెన్సిక్ సైన్సెస్ నుంచి క్రిమినల్ సైన్స్ వరకు స్పెషలైజేషన్స్ చేసే వీలు ఉంటుంది. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ కోర్సులు చేయవచ్చు.

➡ లీగల్ వ్యవహారాలపై ఆసక్తి ఉన్న వ్యక్తులు పీజీ డిప్లొమా ఇన్ సైబర్‌లా, ఎల్ఎల్ఎం ఇన్ క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ చదవాలి. నేషనల్ లా స్కూల్స్ ఈ కోర్సులను అందిస్తున్నాయి. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ కూడా వివిధ కోర్సులను అందిస్తోంది. ఫోరెన్సిక్ జస్టిస్ అండ్ పాలసీ స్టడీస్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమనటేరియన్ ఫోరెన్సిక్స్‌ని ఆఫర్ చేస్తోంది.

ఉద్యోగం: స్టేట్ ఫోరెన్సిక్ లేబరేటరీలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు అంటే సీబీఐ తదితరాలు, మెడికల్ కాలేజీల్లో వీరికి ఉపాధి లభిస్తుంది. కొన్ని పరిమితులతో ప్రైవేటు దర్యాప్తుల్లో పాల్గొనవచ్చు. కొంత అనుభవం గడించిన తరవాత ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకోవచ్చు. ఐటీలో మాదిరిగా ఆరంభంలోనే కళ్లు చెదిరే ప్యాకేజీలు ఇందులో ఉండవు. స్కోప్ ఎంత ఉన్నప్పటికీ సంబంధిత టెక్నిక్స్, ఇంప్లిమెంటేషన్ అలవడ్డాకే మంచి మొత్తాలను అందుకునే అవకాశం లభిస్తుందనే విషయాన్ని ఇటు వైపు వచ్చే యువత గుర్తుంచుకోవాలి.

ఈ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, గాంధీనగర్
- లోక్‌నాయక్ జేపీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, న్యూఢిల్లీ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, ముంబై
- ఐఎఫ్ఎస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, పుణె
- ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
- డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయ్, సాగర్
- బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ, ఝాన్సీ
- ఎమిటీ యూనివర్సిటీ
- యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్
- డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఆగ్రా
- లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, పంజాబ్

ఎన్ఏడీపీలో పీజీడీఎం

నాగ్‌పూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్(ఎన్ఏడీపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం)(బిజినెస్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఈ ప్రోగ్రామ్ డిఫెన్స్ ఇండస్ట్రీస్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ప్రధానంగా డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అంశాలు బోధిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ, ప్రాక్టికల్ తరగతులు; ఇండస్ట్రియల్ విజిట్‌లు, సెమినార్‌లు, కేస్ స్టడీస్, డిజర్టేషన్/ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. డిఫెన్స్ ప్రొడక్షన్ విభాగాల్లో ఆసక్తి ఉన్నవారు, భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఆఫీసర్లు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్నవారు, పీఎస్‌యూల ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.7,00,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** www.ddpdoo.gov.in/units/nadp

నీలిట్‌లో ఇంటర్న్‌షిప్

హరిద్వార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆర్నెల్ల వ్యవధి గల లెవెల్ 1-వర్క్ బేస్డ్ లెర్నింగ్ ప్రోగ్రామ్. హరిద్వార్‌లో 6, డెహ్రాడూన్‌లో 4 సీట్లు ఉన్నాయి. మహిళలు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు. హరిద్వార్ నీలిట్‌కు చెందిన సైంటిస్టులు, నిపుణులు మెంటార్లుగా వ్యవహరిస్తారు.

ఇంటర్న్‌షిప్ అంశాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, క్వాంటం కంప్యూటింగ్, అగ్మెంటెడ్ రియాలిటీ అండ్ వర్చువల్ రియాలిటీ, బ్లాక్ చెయిన్, వైర్‌లెస్ నెట్‌వర్క్స్, స్మార్ట్ మొబిలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, బిగ్ డేటా అనలిటిక్స్, డిజిటల్ ప్రిజర్వేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, 3డీ ప్రింటింగ్, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్, ఎమర్జింగ్ మెమరీ/స్టోరేజ్ టెక్నాలజీస్, మెషిన్ విజన్, సీపీయూ డిజైన్.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) పూర్తిచేసినవారు లేదా ప్రస్తుతం ఏడు/ఎనిమిది సెమిస్టర్లు చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులు కూడా అర్హులే.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** nielit.gov.in

ఐఐఎం కాశీపూర్‌లో పీహెచ్‌డీ

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ లేదా బెంగళూరు ఐఐఎం నిర్వహించే ఐఐఎంబీ టెస్ట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్‌కి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.

స్పెషలైజేషన్‌లు: బిజినెస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని మాస్టర్స్ డిగ్రీ/ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/సీఏ/సీఎంఏ/సీఎస్ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/బీఆర్క్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా జేఆర్ఎఫ్ నెట్ అర్హత తప్పనిసరి. లేదంటే ఐఐఎంబీ టెస్ట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** iimkashipur.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/t8cTxZkలో చదవండి.


యరపతినేని, టీఎన్‌టీయూసీ నేతలను సత్కరిస్తున్న కార్మిక సంఘ నేతలు

టీడీపీతోనే కార్మికవర్గానికి ఉజ్వల భవిష్యత్తు

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని ● కార్మిక చైతన్య బస్సు యాత్రకు ఘన స్వాగతం

పిడుగురాళ్ల, జనవరి 24: టీడీపీతోనే కార్మికులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, వైసీపీ ఇసుక పాలసీతో రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, కొవిడ్ సమయంలో ఏ ఒక్క కార్మిక కుటుంబాన్నీ వైసీపీ ప్రభుత్వం ఆదుకోలేదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. కార్మికచైతన్య బస్సుయాత్ర బుధవారం పిడుగురాళ్ల పట్టణానికి చేరకోగా అక్కడి షాదీఖానాలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో 12 లక్షలకు పైగావున్న కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు, పథకాలు అందటం లేదన్నారు. పిడుగురాళ్లలో టీఎన్‌టీయూశీ కార్యాలయానికి 10 సెంట్లు స్థలాన్ని కేటాయించడంతో పాటు నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని కూడా అందజేస్తానని యరపతినేని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు చంద్రన్న బీమా ద్వారా రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు ప్రయోజనం పొందేలా చేస్తామన్నారు. నియోజకవర్గంలో వున్న కార్మికుల కుటుంబాలకు బీమా సొమ్మును తానే సొంతంగా చెల్లిస్తానని యరపతినేని తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటుతో పాటు సొంత ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు మాట్లాడుతూ టెక్కలి నుంచి కుప్పంవరకు కార్మిక చైతన్య బస్సుయాత్ర సాగుతుందన్నారు. సమావేశంలో లెనిన్‌బాబు, రెంటపాళ్ల శ్యామ్, చంద్రశేఖర్, బాషా, మందా దుర్గారావు, యడవల్లి కొండలు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సాంబశివరావు, దూదేకుల ఖాసిం, సయ్యద్ అమీర్‌అలి, వీరాస్వామి, కనిగిరి శ్రీను, తంగెళ్ల శ్రీనివాసరావు, తదితర నేతలు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో పలువురికి స్థానం

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి గుంటూరుజిల్లాలోని పలువురు నేతలకు స్థానం దక్కింది. గుంటూరు తూర్పు నుంచి గుడిమెట్ల దయారత్నం, వేమూరు నుంచి బోరుగడ్డ వెంకటరావు, రేపల్లె నుంచి దున్నా సంగీతరావు, సత్తెనపల్లి నుంచి పంచల నాగేశ్వరరావు, పల్లె యప్రాయిమ్, శనగపూల నరసింహారావు, మంగళగిరి నుంచి బొంతల హరిదాసు, ఈపూరి ఇస్మాయిల్(పెద్దబ్బాయి), బొక్క నాగరాజు, ప్రత్తిపాడు నుంచి లింగంగుంట్ల ఆదాంలకు రాష్ట్ర కమిటీలో స్థానం దక్కింది.

బీసీ సెల్ రాష్ట్ర కమిటీలో సత్తెనపల్లికి చెందిన బాతుల వెంకట స్వామి, బాతుల అప్పారావు,తెనాలి నుంచి ఉప్పలపాటి మారుతి వెంకట లింగం, పెదకూరపాడు నుంచి నండూరి వెంకటస్వామి రాజులకు స్థానం దక్కింది.

వీరయ్యచౌదరి ఆశయాలకు వారసులం


చింతలపూడిలో ఎన్టీఆర్, వీరయ్య చౌదరికి నివాళులు అర్పిస్తున్న నరేంద్ర కుమార్, రామాంజనేయులు తదితరులు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

● పొన్నూరులో డీవీసీ వర్ధంతి కార్యక్రమాలు

పొన్నూరుటౌన్, జనవరి24: ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వదిలి వెళ్లిన అశేష ప్రజాభిమానానికి, ఆశయాలకు వారసులుగా పనిచేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం పొన్నూరు, చేబ్రోలు మండలాలో మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 30వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చింతలపూడి గ్రామంలోని స్మృతి వనం వద్ద ఆయన సతీమణి ధూళిపాళ్ళ ప్రమీలదేవి, కుమారుడు నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు వీరయ్య చౌదరికి నివాళులు అర్పించారు. గ్రామంలోని ధూళిపాళ్ళ వీర్యచౌదరి, ఎన్టీఆర్ విగ్రహాలకు, నరేంద్ర కుమార్, ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం నిడుబ్రోలు, పొన్నూరు పట్టణ, నారాకోడూరు, చేబ్రోలు, పశుదాణా కర్మాగారం, డీవీసీ హాస్పటల్, సంగం డెయిరీలో వీరయ్య చౌదరి వర్ధంతి వేడుకలు జరిగాయి. టీడీపీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో క్షీర విప్లవ సారధి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరేనన్నారు. సంగం డెయిరీ బలోపేతానికి కృషి చేశారన్నారు. త్వరలోనే తెలంగాణలోని మిర్యాలగూడలో నూతన ప్లాంట్‌ను ఆరంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ హాస్పటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, సంగం డెయిరీ ఎండీ పి.గోపాళ్ల కృష్ణ, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి రైతుల త్యాగం ఎనలేనిది

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, జనవరి 24: ఆంధ్రుల ఆశల సౌధం, ప్రజా రాజధాని అమరావతి ఉసురు జగన్‌కు తగలక పోదని, మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం చిలకలూరి పేటలోని నివాసంలో ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడుతూ అమరావతి ఉద్యమం 1500 రోజులకు చేరిన సందర్భంగా వారికి సంఘీభావం ప్రకటిస్తూ మరికొన్ని రోజుల్లో రాష్ట్రానికి పట్టిన జగన్ శని వదిలిపోవటంతో పాటు అమరావతికి మంచిరోజులు రానున్నాయన్నారు. రాష్ట్రం కోసం, రేపటి తరం భవిష్యత్ కోసం చంద్రబాబు ఒక్క పిలుపుతో 33వేల ఎకరాల బంగారు భూములను రాజధానికి ఇచ్చిన రైతుల త్యాగాలను స్వార్ధ రాజకీయాలకు జగన్ బలిపెట్టారన్నారు. అమరావతిపై టీడీపీ-జనసేన కూటమి విధానం ఇప్పటికే స్పష్టంగా ప్రకటించామని, తమ ఉమ్మడి ప్రభుత్వం రాగానే అమరావతిని అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి ఒక్క సీటు కూడా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలు, టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ విషయం ముందే గ్రహించి అధికార పార్టీ వైసీపీ తరుపున పోటీ చేయటానికి కూడా ఎవ్వరూ సాహసం చేయటం లేదన్నారు.

గుంటూరు సర్కిల్ ఎస్‌ఏవోగా రామిరెడ్డి

గుంటూరు, జనవరి 24: ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ సీనియర్ అకౌంట్స్‌ఆఫీసర్ (ఎస్‌ఏవో)గా పాశం రామిరెడ్డి మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్‌ఏవోగా వ్యవహ రిస్తున్న సుబ్బారావు ఒంగోలు సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సీపీడీసీఎల్ ఇన్‌ఛార్జ్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామిరెడ్డి గుంటూరు సర్కిల్ ఎస్‌ఏవోగా పనిచేస్తుండగా గుణదలలోని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎస్‌ఏవోగా బదిలీపై వెళ్ళారు. తాజాగా మళ్ళీ మాతృస్థానం గుంటూరుకు బదిలీపై వచ్చారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిన వెంటనే సుబ్బారావు రిలీవ్ అయ్యారు.


కొలిమి కార్మికునితో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

వైసీపీ పాలనలో ప్రజలపై మోయలేని భారం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర,జనవరి 24: రాష్టంలో పేద ప్రజలపై మోయలేని బారాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి మోపుతున్నారని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రజాయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని దావులూరిపాలెం, కొత్తబొమ్మువానిపాలెం, కొల్లిపర శ్రీవీరభద్రస్వామి కాలనీల్లో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటికి పన్ను, ఇంటిలో ఊడ్చిన చెత్తకు పన్ను, మంచినీటికి పన్ను, విద్యుత్ ఛార్జీలు పెంపు ఇలా రకరకాల పన్నులు పెంచి పేదలపై పెనుభారం మోపినట్లు తెలిపారు. వైసీపీ పరిపాలనలో ఏ ఒక్కరూ సంతోషంగాలేరన్నారు. పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇచ్చారేగాని గృహాలు నిర్మించుకోవాలంటే అనేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. కొలిమి కార్మికులతో మాట్లాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, ఆరే శేఖర్, ఆరిమండ వెంకటరెడ్డి, బొల్లు యోగానంద చటర్జీ, దాసరి నరసయ్య, కొల్లి కోటిరెడ్డి, బొంతు చంద్రిక, ఉప్పాల రమేష్‌రెడ్డి, తాతా అంజనేయులు, షేక్ రఫీ, పాల్గొన్నారు.

జగన్‌కు ఎవ్వరూ ఓటు వేయరు

● టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 24: గత ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సారి ఓటర్లు ఎవ్వరూ ఓటు వేయరని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి విదేశీ విద్య పథకాన్ని సక్రమంగా అమలు చేయక పోవటం వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువత తమ భవిష్యత్‌లను కోల్పోయారన్నారు. అంబే ద్కర్ విదేశీ విద్య పథకాన్ని జగనన్న విదేశీ విద్యా పథకంగా మార్చి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు తీవ్ర అవమానం చేశారని అన్నారు. విదేశాలకు వెళ్ళి ఉన్నత చదువులు చదుకొని మంచి ఉద్యోగాలు చేయాలనుకున్న యువత కలలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఎవ్వరూ కూడా జగన్‌కు ఓటు వేయరని తేలి పోయిందన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

గుంటూరు, జనవరి 24 : గుంటూరు నల్లపాడు స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ఇరగదల బ్రహ్మం (35) మృతి చెందాడు. బుధవారం సాయంత్రం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నుంచి ఆటోనగర్ వెళ్ళురోడ్డులో సోనోవిజన్ షోరూం సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆటోనగర్ వైపు నుంచి చిల్లీస్ వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా ట్రాక్టర్ నడుపుతున్న పేరేచర్లకు చెందిన ఇరగదల బ్రహ్మం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు తిరుపతయ్య ఫిర్యాదు మేరకు నల్లపాడు ఎస్‌ఐ జేత్యా నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బ్రహ్మం పేరేచర్లలో ట్రాక్టర్ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


1,13,746 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,16,066 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,13,746 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 64,339 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	9000	18500
273	9000	18000
341	9000	19000
4884	12500	19500
సూపర్ 10	14300	18000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	13000

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

● కలెక్టర్ లోతేటి శివశంకర్



కొండవీడుకోటలోని బురుజుపై ఓటరు దినోత్సవ అవగాహన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ శివశంకర్ తదితరులు

కొండవీడుకోట (యడ్లపాడు), జనవరి26: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా తమఓటుహక్కును వినియోగించుకోవాలని పల్నాడుజిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కోరారు. మండలంలోని కొండవీడుకోటలో బుధవారం ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గుంటూరుకు చెందిన ట్రెక్కింగ్ బృందం సభ్యులతో కలసి అధికారులంతా సమీపంలోని కొండపై ఉన్న బురుజుపైకి ట్రెక్కింగ్ నిర్వహించి ఓటరు దినోత్సవ బ్యానర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారు 85 శాతం ఉండగా, పట్టణాల్లో అది 5 నుంచి 10శాతం తక్కువగా ఉంటున్నదన్నారు. ఓటు హక్కు నమోదు, వినియోగంపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్ళు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు, కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో అలసత్వం.. వీఆర్వోపై చర్యలు

చేబ్రోలు, జనవరి24: చేబ్రోలు మండలం, శేకూరు గ్రామంలో ఎన్నికలు విధులు, శాఖాపరమైన అలసత్వం వహించిన బీఆర్వో మద్దు బాబుపై చర్యలు తీసుకొన్ని కలెక్టర్‌కు అటాచ్ చేసినట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. శేకూరు గ్రామంలో 76వ పోలింగ్ బూత్‌లో ఆరు కొత్త ఓట్ల నమోదులో ఒకే తండ్రి పేరు నమోదు చేసిన అంశంపై విచారణ నిర్వహించిన నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఈ తప్పును సరిదిద్ది ఫిబ్రవరి నెలలో విడుదల చేసే అనుబంధ ఓటరు జాబితాలో ప్రచురించనున్నట్లు చెప్పారు. అలాగే 124వ బూత్‌లో మృతుల ఓట్లను జాబితాలో తొలగించినట్లు తెలిపారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన సీఎం జగన్‌రెడ్డి

● మూడు రాజధానుల ప్రకటనతో కనుమరుగైన అభివృద్ధి

● 1499వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం ధర్నాశిబిరంలో నినాదాలుచేస్తున్న మహిళలు

తుళ్లూరు జనవరి24: రాజధాని అమరావతి నిర్మాణాన్ని విస్మరించి రాష్ట్రానికి, ఐదు కోట్ల మంది ప్రజలకు సీఎం జగన్‌రెడ్డి ద్రోహం చేశారని రాజధానికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1499వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఎక్కడా.. అనే మీమాంసలో ఉండి పెట్టుబడిదారులు కంపెనీలు పెట్టేందుకు ముందుకు రావటం లేదన్నారు. అదే అమరావతి రాష్ట్ర ఏకైక రాజధానిగా అభివృద్ధి కొనసాగుతుంటే, ప్రతి కంపెనీ రాష్ట్రం వైపు చూసేద న్నారు. లక్షల కోట్ల రాష్ట్ర సంపదను సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో ఆవిరి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. హైకోర్టు చెప్పినా వినిపించుకోకుండా జగన్‌రెడ్డి మొండివైఖరి ప్రదర్శించటం సరికాదన్నారు. ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం, రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

రహదారులపై ప్రమాదాలను పూర్తి స్థాయిలో అరికట్టాలి

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 24: రహదారులపై ప్రమాదాలను పూర్తి స్థాయిలో అరి కట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించా రు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారుల భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు రక్షించటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. ఏదైన ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను తక్షణమే వైద్యశాలకు తరలించి వారికి వైద్యం అందేలా చూడాలన్నారు. జాతీయ రహదారిపై నమోదు అవుతున్న కేసులు నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు మినరల్ ఫండ్ నుంచి వినియోగించాలన్నారు. వాహనాలు, డ్రైవర్ లైసెన్స్‌ల పునరుద్ధరణకు వచ్చే సమయంలో వాహనాల కండీషన్ నిశితంగా పరిశీలించాలన్నారు. జాతీయ రహదారిలోకి ప్రవేశించే అప్రోచ్‌రోడ్డులు, గ్రామాలు నుంచి వచ్చే ప్రధాన రహదారుల వద్ద బారికేడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, జిల్లా రవాణాశాఖాధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్‌లు రాంబాబు, రంగారావు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.



రహదారుల భద్రతపై జిల్లా స్థాయి కమిటీతో సమావేశమైన కలెక్టర్ రంజిత్‌బాషా

సురక్షిత ప్రయాణం అందించాలి : డీపీటీవో

బాపట్ల, జనవరి 24: విద్యార్థులు, ప్రజలకు సురక్షిత ప్రయాణం అందించాలని డీపీటీవో విజయకుమార్‌రెడ్డి తెలిపారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులు ప్రతిరోజు తమను సకాలంలో సురక్షితంగా స్కూల్‌కు, ఇంటికి చేర్చుతున్న డ్రైవర్లకు గులాబీలు ఇచ్చి అభిమానం తెలియజేశారు.

జర్నలిస్టులందరికి నివేశన స్థలాలివ్వాలి

బాపట్ల, జనవరి 24: జిల్లాలోని జర్నలిస్టులందరికి ప్రభుత్వం ప్రకటించిన హౌస్‌సైట్ స్కీమ్ వర్తింప చేయాలని బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు బుధవారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను వినతిపత్రం ద్వారా కోరారు. గడిచిన 5 సంవత్సరాల్లో ఏ విధమైన లబ్ధిపొందని జర్నలిస్టులకు స్థలాలివ్వాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డులు ఉన్నవారందరికి స్థలాలివ్వటంతోపాటు పెండింగ్‌లో ఉన్న వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చి వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధితాధికారులను ఆదేశిస్తామని హామీనిచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసి స్థలాల సమస్యపై వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ధనరాజు, రాఘవేంద్రరావు, సభ్యులు ఉప్పాల శ్రీనివాసరావు, ఏడుకొండలురెడ్డి, దాసు, మురళీ, ప్రసాద్, కరీమ్, ప్రశాంత్, కోటి, సుబ్బారావు, సుభానీ, అంజయ్య, ఆనంద్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గణతంత్ర దినోత్సవ కవాతు అద్భుతంగా నిర్వహించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జనవరి 24 : గణతంత్ర దినోత్సవం నాడు నిర్వహించే పోలీసు కవాతు రిహార్సల్స్‌లను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం పరిశీలించారు. గణతంత్ర దినోత్సవం నాడు కవాతు అద్భుతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మధరావు పోలీసు కవాతు రిహార్సల్‌లకు కమాండర్‌గా వ్యవహరించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. వాహనంలో పర్యటించి కవాతు పరిశీలించారు. అనంతరం పెరేడ్‌కమాండర్ అతిథి ఆదేశాల మేరకు పోలీసు బలగాలు, ఎన్‌సీసీ విద్యార్థులతో మార్చింగ్ నిర్వహించుకుంటూ బేస్‌లైన్ వద్దకు చేరుకొని ప్రసంగించారు. ఆద్యంతం అద్భుతంగా సాగిన రిహార్సల్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవంలో నిర్వహించే కవాతు మరింత అద్భుతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఎఆర్‌డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్ కుమార్, డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్ మన్మధరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంగం డెయిరీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కర్లపాలెం, జనవరి 24 : మండలంలోని పెదపులుగువారిపాలెం గ్రామంలో సంగం డెయిరీ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం బుధవారం ఏర్పాటు చేశా రు. మాజీ మంత్రి, సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి 30వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 170 పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొరిగపూడి శివాలయం ధ్వజస్తంభం ఊరేగింపు

భట్టిప్రోలు, జనవరి 24 : మండలంలోని గొరిగపూడి గ్రామంలో ఉన్న భ్రామర దుర్గాదేవి సమేత నాగేశ్వర స్వామి ఆలయ పునఃప్రతి ష్ఠ కార్యక్రమాలలో భాగంగా ఆలయ ధ్వజస్తంభంను బుధవారం గ్రామంలో ఊరేగించారు. ధ్వజస్తంభంకు ప్రత్యేక పూజా కార్యక్రమా ల అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చి దేవాలయానికి చేర్చారు. ఆలయ ముఖమండపం, ప్రాంగణ గోపురములకు రంగులు తీర్చిదిద్ది పునఃప్రతిష్ఠ ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నారు. ఆలయ ధ్వజస్తంభం గ్రామోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్థులు పర్యవేక్షణ గావించారు.

పేదలకు అండగా నిలిచిన రవీంద్ర

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



పరిటాల రవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని

రేపల్లె, జనవరి 24: పేదలకు అండగా నిలిచి సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంటూ రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన నాయకుడు పరిటాల రవి అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పరిటాల యువసేన కార్యాలయం వద్ద మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరిటాల యువసేన దండమూడి ధరణికుమార్, ఎన్టీఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో మాజీ మంత్రిగా ఎనలేని సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నా రు. 647మంది రక్తదానం చేయగా సేకరించిన రక్తాన్ని ఎన్టీఆర్ ట్రస్టుకు అందించారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్టు పరిటాల యువసేన సంయుక్త ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నల్లూరి అజయ్‌కుమార్, నాగమల్లి, రేపల్లె పాపారావు, తాతా ఏడుకొండలు, లక్ష్మి పాల్గొన్నారు.

● అమృతలూరు, జనవరి 24 : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి ఘనంగా బుధవారం నిర్వహించారు. స్థానిక పరిటాల విగ్రహం వద్ద స్థానిక టీడీపీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, తదితరులు పరిటాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, బొల్లు రామేశం, నార్ల శ్రీనివాసరావు, పాములపాటి వెంకట సుబ్బా రావు, అచ్చన వెంకటేశ్వరరావు, మాధ్యూస్, బోరుగడ్డ ఆనంద్, కొసరాజు దేవకుమార్, బెనర్జీ, కొడాలి నాగయ్య, ప్రభాకరరావు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



అమృతలూరులో పరిటాల రవికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



సభలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ

బాలికా విద్యను ప్రోత్సహించాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ

బాపట్ల, జనవరి 24: బాలికా విద్యను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ కోరారు. బాప ట్ల పట్టణంలోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం రమాదేవి అధ్యక్షత వహించగా డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆమె మాట్లాడుతూ బాలికల డ్రాపవుట్స్‌ను అరికట్టాలని కోరారు. ఎక్కువ మంది బాల్యవివాహాలు చేసుకుంటున్నారన్నారు. దీనివల్ల మనిషి ఎదుగుదల లోపించటంతోపాటు పుట్టే పిల్లలకు అనారోగ్యం ఏర్పడుతుందన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భంలో ఉన్నప్పుడే ఆడశిశువును చంపేస్తున్నారని ఇది తీవ్ర నేరంగా పరిగణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, ఏసీడీపీవో లక్ష్మీపార్వతి, జిల్లా మలేరియాధికారి వై రాజ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో రోషిణి, ఎండీ సాధిక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జ్యోతి, కుమారి, పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 24 : బాలికల హక్కులపై సీడీపీవో విజయలక్ష్మి అవగాహన కల్పించారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని కొల్లూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చావా ఉషాకుమా రి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నగరాజకుమారి, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 24: సమాజంలో బాలికల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫోరం కో ఆర్డినేటర్ కీర్తన తెలి పారు. బాలికల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని చావలి, జంపనిపల్లి, వరహాపురం గ్రామాల్లో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, వలంటీర్లు, బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

లంక భూములకు పట్టాలు పంపిణీ

కొల్లూరు, జనవరి 24 : లంక భూములు సాగు చేస్తున్న రైతులకు వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాసరావు పట్టాలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని చిలుమూరులంకలో బుధవారం 40మంది రైతులకు శాశ్వత పట్టాలు పంపిణీ కార్యక్రమంలో జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, మాజీ ఎంపీపీ పద్మారావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన, అందాల పోటీలు

కర్లపాలెం, జనవరి 24 : మండలపరిధిలోని పేరలి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా బుధవారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకాధికారి మద్దు హనుమంతరావు, పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు వైకే దారేశ్వర్లు పాల్గొని దూడలను పరిశీలించారు. మేలుజాతి దూడలను గుర్తించి వాటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అధికారుల చేతులమీదగా అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి రైతుకు కన్సోలేషన్ బహుమతులు, మినరల్ మిక్చర్ ఆరుగుదల మందులను, ఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.శంకరరావు, పశువైద్యులు ఎం రేచల్ దివ్య, కె.తిరుమలతేజ, ఎం.మహేష్, వనజలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



దూడలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి హనుమంతరావు

ఆడుదాం ఆంధ్రలో జిల్లాస్థాయి జట్ల ఎంపిక

కర్లపాలెం, జనవరి 24: బాపట్ల నియోజకవర్గ స్థాయిలో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండలంలోని దుండివారిపాలెం, పెదగొల్లపాలెం జట్లు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. దుండివారిపాలెంకు చెందిన ఖోఖో జట్టు పిట్టలవానిపాలెం జట్టుపై తలపడి విన్నర్‌గా నిలిచి జిల్లా జట్టుకు ఎంపికైంది. పెదగొల్లపాలెంనకు చెందిన క్రికెట్ పురుషుల జట్టు పిట్టలవానిపాలెం జట్టుపై తలపడి 50 పరుగుల తేడాతో విజయం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ క్రీడా కార్యక్రమాలను వ్యాయామ ఉపాధ్యాయులు కరీముల్లా, మద్దె గోపి తదితర పీఈటీలు పర్యవేక్షించారు. ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, మందపాటి పరమానందకుమార్, సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం : అనగాని

నగరం, జనవరి 24: మండలంలో అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని దాసరిపాలెంలో టీడీ పీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసమే టీడీపీ జనసేన కలిశాయని ఉద్ఘాటించారు. ఈ సారి జనసేన, టీడీపీ సంయుక్త ప్రభుత్వమే ఏర్పడుతుందని అనగాని అన్నారు. ఈ సందర్భంగా పెదమట్లపూడి పంచాయతీ గూడపాటివారిపాలెం చెందిన కోడె సుందరయ్య, కోడె వెంకటేశ్వర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనంతరం పేదలకు బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు, నున్న నాగబాబు, వెంకట్‌సోము, రౌతు శ్రీనివాసరావు, తాటిపాక సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగు పంటలపై రైతులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయబాబు

వేమూరు, జనవరి 24: మండలంలోని చావలి రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి సునీత అధ్యక్షతన రబీ పంటల సాగు పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ గుంటూరు వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాపట్ల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి ఆర్ విజయబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు సూచనలు ఇచ్చారు. మినుము మొక్కజొన్న, పెసర పంటలో ఎరువుల యాజమాన్యం సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో పులువురు రైతులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, జనవరి 24 : పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ బాజి అధ్యక్షతన బుధవారం మండలస్థాయి, వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై వివిధ శాఖల అధికారులు సభను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో భవనం మారుతీ శేషమాంబ ఆయా అంశాలపై కార్యాచరణ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఉప ఎం పీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఈవోపీఆర్డీ కె.పద్మజలు, సర్పంచులు మంతెన గంగరాజు, డి.మాధవరావు, ఏట్ర అశ్విని, ఉప్పు చెంచులక్ష్మి, దోమా వెంకటేశ్వరరెడ్డి, కె.అనూష ప్రసన్నరాజు, ఎనికేపల్లి శివకుమారి, మార్కెట్‌యార్డు డైరెక్టర్‌లు తూనుగుంట్ల శ్రీనివాసరావు, ఖాజీపాలెం సొసైటీ అధ్యక్షులు కె.దేవేంద్రరాజు, ఎంపీటీసీలు వాలి కృష్ణకుమారి, చేబ్రోలు రాహేల్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేత

పిట్టలవానిపాలెం, జనవరి 24 మండలపరిధిలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీ ఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 43వ క్రీడా వార్షికోత్సవం, డాక్టర్ బీఎస్.రాజు జూనియర్ కళాశాల 27వ క్రీడా వార్షికోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషుల 5కే రన్, బాపట్ల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలల సీనియర్ బాలుర 3కే రన్, బాలికల 2కే రన్ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ క్రీడావార్షికోత్సవంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రి ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీల్లో 9 మంది పురుషులు, ఆరుగురు మహిళలు మహారాష్ట్రలోని పరగణాలో జరిగే జాతీయ స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ వార్షికోత్సవంలో చంపాటి చినసూరపు రాజు, సౌభాగ్యమ్మ సౌజన్యంతో జరిపిన పోటీల్లో సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 5కే రన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆర్.రమేష్ చంద్ర (ప్రథమబహుమతి) హైదరాబాద్‌కు చెందిన బి.రమేష్ (ద్వితీయ బహుమతి), హైదరాబాద్‌కు చెందిన ఎం.వెంకటరామిరెడ్డి (తృతీయ బహుమతి)లు గెలుపొందారు. 3కే రన్ పోటీల్లో దేవినూతల గ్రామానికి చెందిన బాపట్ల లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థి వై.సతీష్ (మొదటి బహుమతి), ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన గణేష్ రెడ్డి (రెండో బహుమతి), ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కార్తీక్‌రెడ్డి (మూడో బహుమతి)లు కైవసం చేసుకున్నా రు. 2కే రన్ బాలికల విభాగంలో ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.నాగస్వాతి (మొదటి బహుమతి), ఖాజీపాలెం జడ్పీహైస్కూల్‌కు చెందిన జెస్సికా విద్య (రెండో బహుమతి), ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన వాసంతి (మూడో బహుమతి)లు సొంతం చేసుకున్నారు.



జిల్లా స్థాయికి చేరిన దుండివారిపాలెం ఖోఖో పురుషుల జట్టు

ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ ప్రొఫెసర్ పి.జాన్సన్ పాల్గొన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షులు మంతెన నరసరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు మంతెన శివరామరాజు, కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాస్‌కుమార్, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుబ్బరాజులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాకేతర సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్

చుండూరు, జనవరి 24: మోదుకూరులోని శ్రీవేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా గురువారం పరిశీలించారు. ఈ పాఠశాలలో గతంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయవలసి రావడంతో దీనిపై మండల అధికారుల నుంచి ఆయన వివరణ తీసుకున్నారు. ఈ గ్రామంలో ని దళితవాడ పాఠశాల ఏర్పాటు చేసే రెండు పోలింగ్ కేంద్రాల స్థలంలో నాడు - నేడు భవన నిర్మాణం జరుగుతుండటంతో ఆ రెం డు పోలింగ్ కేంద్రాలను కూడా జిల్లా పరిషత్ పాఠశాలకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ ఏడు పోలింగ్ కేంద్రాలకు సరిపడిన స్థలం జడ్పీ పాఠశాలలో ఉండటంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నాడు - నేడు, మధ్యాహ్న భోజన పథకం, బోధనా విధానాలను ఆయన పరిశీలించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.కనకదుర్గ, ఎంపీడీవో సుగుణమ్మ, హెచ్‌ఎం మండేపూడి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం ధర్నా చేస్తున్న 2, 28 వార్డు ప్రజలు

తాగునీటి కోసం రోడ్డుపై ధర్నా

రేపల్లె, జనవరి 24: తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న ము న్సిపల్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఆరోపించారు. బుధవారం పురపాలక సంఘంలోని 2, 28వవార్డు ప్రజలు వారం రోజులుగా తాగునీరు రాకపోవటంతో రోడ్డు పై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా రెండు రోజులు వచ్చి రెండురోజులు రావటం లేదంటూ ప్రజ లు ఆరోపించారు. వారం రోజులుగా తాగునీరు రావటం లేదని మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఏఈలు ధర్నా వద్దకు చేరుకుని ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలపటంతో కాలనీవాసులు వారిని చుట్టుముట్టి వారం రోజులుగా చెప్పిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించటం ఏమిటని నిలదీశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ విజయసారథి రెండు రోజుల్లో తాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనివ్వటంతో ధర్నాను విరమింపజేశారు.

సమాజశ్రేయస్సుకు పని చేస్తున్న ఏబీవీపీ

● రాష్ట్ర కార్యదర్శి సూళ్ళూరు యచంద్ర



భారీ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాపట్ల, జనవరి 24: సమాజశ్రేయస్సు కోసం ఏబీవీపీ పనిచేస్తుందని రాష్ట్ర కార్యదర్శి సూళ్ళూరు యచంద్ర తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏబీవీపీ బాపట్లశాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని యచంద్ర, ఆర్‌ఎస్ఎస్ నగర కార్యవాహ ఉపేంద్రలు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండా పట్టుకొని ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా యచంద్ర మాట్లాడుతూ 75సంవత్సరాలుగా దేశంలోని విద్యార్థుల హృదయాల్లో జాతీయభావాలను నింపుతూ క్షణం క్షణం.. మాకణం కణం భరతమాతకే సమర్పణం అంటూ పనిచేస్తున్నామన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణాలర్పించారని వారు కన్న కలలన్నిటిని నేటియువత ఆదర్శంగా తీసుకొని వాటిని నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు వెంకటరామకృష్ణ, పి.మురళీ కృష్ణ, కార్తీకేయ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అద్దేపల్లి రామ కోటి ఉత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు, జనవరి 24: 73వ శ్రీరామనామ స్మరణ కోటి అద్దేపల్లి రామకోటి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీరామ రామ సప్తాక్ష రీ నామ పతాకాన్ని సంఘ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు ఆవి ష్కరించారు. గురువారం ఉదయం అంకురార్పణ, ప్రభాతసేవ, కోదండరామస్వామికి సహస్రనామార్చన, శ్రీరామ సప్తాక్షరీ పటం నగరోత్సవం అనంతరం భక్తులచే లిఖించబడిన శ్రీరామ సప్తాక్షరీ గ్రంథాలకు పూజలు జరుగనున్నాయి. శుక్రవారం శ్రీసీతారామ కల్యా ణ మహోత్సవం, శనివారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, ఆది వారం గీతాజ్ఞాన కర్పూర యజ్ఞం, సాయంత్రం అర్ధ ఏకాహం, అనంతరం అన్న సమారాధన జరుగుతుందని భాస్కరరావు వివరించారు. 4 రోజుల పాటు అద్దేపల్లిలో జరిగే రామకోటి ఉత్సవాలకు వచ్చే భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

రేపల్లె రూరల్ సీఐగా మల్లికార్జునరావు బాధ్యతల స్వీకరణ

రేపల్లె, జనవరి 24: రేపల్లె రూరల్ సర్కిల్ స్టేషన్ సీఐగా మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి సాధారణ బదిలీలో భాగంగా రేపల్లె వచ్చారు. సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టిపరిస్థితుల్లోను రాజీపడే ప్రసక్తే లేదన్నారు.



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు కోడూరి శేషబ్రహ్మచారి

బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

పర్చూరు, జనవరి 24: బీసీల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి అన్నారు. బుధవారం పర్చూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి జయహో బీసీ సదస్సులో ఆమె మాట్లాడారు. తెలుదేశం పార్టీకి బీసీలే వెన్నుముఖఅని, వారి సంక్షేమం కోసం ఉద్భవించిన పార్టీ టీడీపీ అని అన్నారు. బీసీ సోదరులంతా ఐక్యంగా పనిచేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేవిధంగా కృషిచేయాలని కోరారు. రాష్ట బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరి శేషబ్రహ్మచారి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు ఆదరణ కరువైందన్నారు. కల్లబొల్లి మాటలు, అధికారంలేని పదవులను కట్టబెట్టి కాలయాపన చేసిందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బీసీలకు అండగా నిలవటం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈకార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్.షంషుద్దీన్, పట్టణపార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, బాపట్ల పార్లమెంట్ బీసీసెల్ అధ్యక్షులు జనార్ధన్, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షులు శివరాత్రి శ్రీనివాసులు, నాయిబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, రజక సాధికార సమితి అధ్యక్షులు నక్కల నారాయణరావు, పార్లమెంట్ కమిటీ కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు, నియోజకవర్గ కార్యదర్శి కూరపాటి జగన్, స్థానిక నేతలు ఉప్పుటూరి నరేంద్ర, కారంచేడు మండల మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్.ఖాశీం, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, మార్టూరు, చినగంజాం, ఇంకొల్లు మండలాల బీసీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న బాలికలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

చినగంజాం, జనవరి 24 : బాలికలు బాగా చదువుకొని అన్ని రంగాల్లో బాలురతో పాటు సమానంగా రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మల్లారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం, అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, సరోజినినాయుడు, ఇందిరాగాంధీ, మథర్‌దేరిసా, రాణిరుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీభాయ్‌లను ఆదర్శంగా తీసుకొని బాలికలందరూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని హెచ్ఎం అన్నారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని బాలికలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం, ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, పి.హిమవంతేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కలిగించారు. ఇంకొల్లు ఐసీడీఎస్ సీడీపీవో టి.ఝాన్సీ బాలికలపై జరిగే లైంగిక వేధింపుల గురించి అవగాహన కలిగించారు.సంపూర్ణ పౌష్టికాహారంతో ఆరోగ్యసమస్యల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎస్అండ్‌వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయలక్ష్మి,హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో విజయలక్ష్మి నుంచి బహుమతిని అందుకుంటున్న చక్రాయపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని యశస్విని

వ్యాసరచనలో చక్రాయపాలెం విద్యార్థిని ప్రతిభ

అద్దంకిటౌన్, జనవరి 24: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వంకాయలపాటి యశస్విని తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎస్. విజయలక్ష్మి నుంచి 2వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారు. విద్యార్థినిని, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు ఎస్‌కె షంషుద్దీన్‌ను హెచ్‌యం కె. శ్రీనివాసరావు, సర్పంచ్ నగేష్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ జి. పార్వతి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

అద్దంకి పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణకుమారి హాజరై పలు విషయాలను బాలికలకు తెలియజేశారు. కమిటీ ఛైర్మన్ సుధాకరరెడ్డి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు కాంట్రాక్టర్ గంగోటి సంజీవరెడ్డి స్వీట్లు పంపిణీ చేశారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మార్టూరు, జనవరి 24: టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినం సందర్భంగా ఈ నెల 26 న శుక్రవారం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 7 గంటలనుంచి శంకర కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా బీపీ. షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటిఆస్పత్రి వారి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.మార్టూరు ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

30న మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30 వతేదీ ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో నితిన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండలంలోని అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు పాల్గొన్నాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

వైసీపీ నేత ఆధీనంలోని ఎండోమెంట్ భూమి స్వాధీనం

12 ఏళ్లుగా కోర్టులో ఉన్న వివాదం
ఎట్టకేలకు అధికారులకు పత్రాలు అప్పగింత

చీరాలటౌన్, జనవరి 24 : చీరాల పట్టణంలోని దండుబాట రోడ్డులో గల 11.79 ఎకరాల ఎండోమెంట్ భూమికి సంబంధించిన చిక్కుముడి బుధవారం వీడింది. స్థానిక వైసీపీ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు అవ్వారు ముసలయ్య, ఆయన కుటుంబం ఆధీనంలో ఉన్న పొలాన్ని ఎండోమెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన కేసు సుమారు 12 ఏళ్లుగా కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం కోర్టుకు హాజరయిన ముసలయ్య ఎట్టకేలకు పొలాన్ని అప్పగించేందుకు ఒప్పుకున్నారు. దీంతో బాపట్ల ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.పానకాలరావు బుధవారం సిబ్బందితో హాజరై ముసలయ్య నుంచి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే ఈ పొలం సుమారు 44 ఏళ్లుగా అవ్వారు ముసలయ్య ఆయన కుటుం బం ఆధీనంలో ఉంది. ఆయన పలుకుబడి కలిగిన నాయకుడు కావడం,వివిధ వ్యాపారాలు, విద్యాసంస్థలు, ట్రస్ట్‌లు ఉండటంతో ఏళ్లుగా వ్యవహారం నానుతూ వచ్చింది. దీంతో ఆయన తనకు అనుకూలమైన ఓ నాలుగు కుటుంబాలకు ఆ భూమిలో నివాసాలు ఏర్పాటు చేసి కాపలాదారులుగా ఉంచారు. ఆ నాలుగు కుటుంబాలకు చెందిన వారు వలస కుటుంబాలు కావడంతో ముసలయ్య అడుగుజాడల్లో నడిచేవారు. అయితే 12 ఏళ్ల క్రితం ఈ భూమి ఎండోమెంట్‌దని, తమకు అప్పగించాలని అప్పట్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు ముసలయ్యను కోరారు. అందుకు ఆయన నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ వివాదంపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈక్రమంలో మూడు రోజుల క్రితం కోర్టుకు హాజరైన ముసలయ్య ఎట్టకేలకు పొలాన్ని ఎండోమెంట్‌కు అప్పగించేందుకు అంగీకరించారు. ఈక్రమంలో బాపట్ల ఎండోమెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకునేందుకు వచ్చారు. అయితే అవ్వారు ముసలయ్య హద్దులు చూపిస్తున్న తరుణంలో అందులో నివాసం ఉంటున్న శేఖరరెడ్డి మరి కొంతమంది ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాము పలుమార్లు వేరే చోట స్థలాలు కొనుక్కునేందుకు ప్రయత్నాలు చేయగా వద్దు.. ఇక్కడే ఉండండి.. మీకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆపారని, ఇప్పుడు ఇక్కసారిగా ఎండోమెంట్‌కు అప్పగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని వారు వాదించారు. తాము నలభై ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, ఖాళీ చేసేది లేదని ముసలయ్యపై దాడికి యత్నించారు. అయితే అధికారులు తీవ్రంగా హెచ్చరించడంతో వారు తగ్గారు. అనంతరం ముసలయ్య ఆయన కుటుంబీలకు నుంచి సంబంధిత పత్రాలు స్వాధీనం చేసుకుని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై ముసలయ్య మాట్లాడుతూ పొలాన్ని తాను లీజుకి మాత్రమే తీసుకున్నట్లు చెప్పారు. 2020లో లీజు పూర్తయిందని, నేడు అధికారులు తిరిగి ఇమ్మని కోరడంతో అప్పగించినట్లు వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంట ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో జీవీఎల్ కుమార్, స్థానిక భావనారుషి దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అవ్వారు ముసలయ్య, ఆయన కుటుంబీకుల నుంచి పత్రాలను స్వాధీనం చేసుకుంటున్న ఎండోమెంట్ అధికారులు



మార్టూరు టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టి ముక్కల కృష్ణంరాజు

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టి ముక్కల కృష్ణంరాజు

మార్టూరు, జనవరి 24 : ఇసుక కొరతను సృష్టించడంతో రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని, 64 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వైసీపీ ప్రభుత్వానికి అందరూ చరమ గీతం పాడాలని టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టి ముక్కల కృష్ణంరాజు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మార్టూరు వచ్చిన టీఎన్టీ యూసీ బస్సుయాత్రకు మార్టూరులో పార్టీ కార్యాలయం వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్, మోటారు, ఆర్టీసీ, తదితర అన్ని రంగాలలోని కార్మికులను మోసం చేసిన జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. చంద్రన్న బీమా ద్వారా 2 కోట్ల 42 లక్షల మంది కార్మికులకు ఉన్న సామాజిక భద్రతను తొలగించడానికి ఈ బీమాను నీరు గార్చారన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, రాష్ట్రానికి మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ నాయకులు నరహరి శ్రీనివాసరావు, సైదా, మండల పార్టీ నాయకులు తాటి నాగేశ్వరరావు, తొట్టెంపూడి భుజంగరావు, కమ్మ శివ నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం : టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టిముక్కల రఘురామరాజుని మండల టీడీపీ నేతలు మార్టూరులో మర్యాద పూర్వకంగా కలిసారు. టెక్కలి నుంచి కుప్పం వరకు చైతన్య యాత్ర చేస్తూ బుధవారం రాత్రి మార్గమధ్యంలో గల మార్టూరు టీడీపీ కార్యాలయానికి వచ్చారు టీడీపీ పర్చూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల టీడీపీ నేతలు ఆయనకు స్వాగతం పలికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి దండుప్రోలు బాలరాజు, నాయకులు సందు శ్రీనివాసరావు, షేక్.జిలాని, గుండ్రెడ్డి నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్అండ్‌బీ రహదారులు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
కనీస మరమ్మతులకు నోచుకోని దుస్థితి
తరచూ ప్రమాదాల బారిన వాహనదారులు

పర్చూరు, జనవరి 24: పర్చూరు నియోజకర్గ పరిధిలో అర్అండ్‌బీ రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు, కంకరరాళ్ళు పైకి లేచి ప్రమాద భరితంగా దర్శనమిస్తున్నాయి. దీంతో నిత్యం ఏదో ఒక చోట వాహన దారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. పర్చూరు నియోజకవర్గం కేంద్రం అయా ప్రధాన పట్టణాలకు కూడలిగా ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు పర్చూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతినటంతో వాహన దారులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ఏళ్ళ తరబడి రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నా కనీస మరమ్మతులకు కూడా నోచుకోక పోవటం విచారకరం. కనీసం అధికారులు సైతం ఇది తమ పనికాదన్నట్లు మొఖం చాటేస్తున్నారు. పర్చూరు నుంచి ఇంకొల్లుకు వెళ్ళే పాత మద్రాసు రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించినా పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు రహదారికి ఇరువైపులా ఉన్న చింతచెట్లను తొలగించారే తప్ప రోడ్డు నిర్మాణం చేస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. అలాగే నూతన జిల్లా కేంద్రం పర్చూరు నుంచి చెరుకూరు వీదుగా వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గడిచిన నెలరోజుల వ్యవధిలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. పర్చూరు నుంచి యద్దనపూడి మీదుగా మార్టూరు వెళ్ళే ప్రధాన రహదారి అత్యంత దయనీయంగా మారింది. ఇటీవల జాగర్లమూడి మలుపు వద్ద రోడ్డు గుంతగా మారటంతో ఇరువురు యువకులు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇంత ప్రమాద కరంగా పరిస్థితి ఉన్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి అన్నీ మండలాల్లోని రహదారులు కావటం విశేషం. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి కనీస మరమ్మతులు చేయించాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.





పర్చూరు - యద్దనపూడి మధ్య అధ్వానంగా ఉన్న రహదారి (ఇన్‌సెట్లో) జాగర్లమూడి మలుపు వద్ద పరిస్థితి ఇలా



పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే రహదారిలో పడిన పెద్ద గొయ్యి

స్కూల్‌బస్సును ఢీకొన్న ద్విచక్రవాహనం

ఇద్దరు యువకులకు గాయాలు

మార్టూరు, జనవరి 24: సర్వీసు రోడ్డులో వెళుతున్న ప్రయివేటు స్కూల్ బస్సును ఎదురుగా ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండల పరిధిలో జొన్నతాళి సెంటరు వద్ద సర్వీసు రోడ్డులో జరిగింది. మార్టూరు వైపు నుంచి జొన్నతాళి సెంటరుకు సర్వీసు రోడ్డులో ప్రయివేటు స్కూల్ బస్సు వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొన్నది. దాంతో రోడ్డుపై పడిపోయిన ద్విచక్రవాహనంలోని ఇద్దరు యువకులు ఎస్‌కె బాజి, వజీర్ అహమ్మద్‌లకు గాయాలయ్యాయి. పోలీసులు వారిని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు గాయపడిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. వారికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఏఎస్ఐ బాష తెలిపారు.



జొన్నతాళి సెంటరులో ప్రమాదం జరిగిన ప్రదేశం

బాలికల హక్కులపై అవగాహన కల్పించాలి

బల్లికురవ. జనవరి 24 : సమాజంలో బాలికలకు ఉన్న హక్కులపై వారికి అవగాహన కల్పించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సమావేశం జరిగింది. సమావేశంలో బాలికలకు కల్పిస్తున్న రక్షణ వారికి ఉన్న హక్కుల గురించి వివరించారు. బాల్య వివాహాలు చేపట్టడం వలన కలిగే ప్రమాదాలపై వివరించారు. అనంతరం ప్రత్యేక బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుధ, ఈవోపీఆర్డీ సుమతి, మండల పరిషత్ కార్యాలయ ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



భవనాసి చెరువు వద్ద నీటిని విడుదల చేస్తున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి

మళ్లీ భవనాసి నీటి విడుదల

రెండు నెలల క్రితమే కాలువకు జలాలు
రైతుల విస్మయం

అద్దంకి, జనవరి 24: భవనాసి చెరువు నుంచి కాలువలకు నీటిని బుధవారం వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి విడుదల చేశారు. అయితే ఇప్పటికే రెండు, మూడు నెలలుగా ఆయకట్టులోని రైతులు కాలువలకు నీటి విడుదల చేసుకొని పంటలు సాగుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం హనిమిరెడ్డి భవనాసి చెరువు నుంచి కాలువలకు నీటి విడుదల చేయటం, పూజలు నిర్వహించటంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయా గ్రామాల వైసీపీ నేతలు మెప్పు పొందేందుకు నీటి విడుదల కార్యక్రమం చేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి పట్టణ, మండల వైసీపీ కన్వీనర్‌లు కాకాని రాధాకృష్ణమూర్తి, గుజ్జుల జగన్నోనరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ మాకినేని శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఎర్రిబోయిన తిరుపతయ్య, యర్రా చౌదరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ముడిరాయి లారీలు స్వాధీనం

బల్లికురవ. జనవరి 24 : పర్మిట్లు లేకుండా అక్రమ మార్గంలో తరలి వెళుతున్న అయిదు గ్రానైట్ ముడిరాయి లారీలను మంగళవారం అర్ధరాత్రి సంతమాగులూరు సీఐ కె. నరసింహారావు స్వాధీనం చేసుకొని బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల పరిధిలోని వీర్లకొండ క్వారీల నుంచి వేమవరం, మార్టూరు వైపు వెళుతున్న ముడిరాయి లారీలను సీఐ నిలిపి తనిఖీలు చేయగా వాటికి సరైన పత్రాలు లేకపోవటంతో స్టేషన్‌లో అప్పగించారని ఎస్ఐ వి. వేమన తెలిపారు. పట్టుబడిన లారీలను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. పోలీస్ అధికారులు రాత్రుళ్లు గతంలో ఎప్పుడు లేని విధంగా తనిఖీలు చేపట్టటంతో అక్రమ రవాణాదారులలో ఆందోళన నెలకొంది.



బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడి ఉన్న గ్రానైట్ ముడిరాయి లారీలు

రేపు వలపర్లలో ఉచిత మెగా వైద్య శిబిరం

మార్టూరు, జనవరి 24: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 26 న శుక్రవారం మండలంలోని వలపర్ల గ్రామంలో కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్మినేని సూపర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు కొమ్మి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె, కిడ్నీ, నరాలు, దంత తదితర వైద్యులు పాల్గొంటారని ప్రజానీకం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణకు నేతలు

అద్దంకి, జనవరి 24 : టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణకు అద్దంకి నియోజక వర్గానికి చెం దిన పలువురు నేతలు హాజరయ్యారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మసూద్, మీరావలి, మన్నేపల్లి మస్తాన్, ఖాదర్‌బాషా, పరిటాల భరత్ తదితరులు ఉన్నారు.



శిక్షణకు హాజరైన అద్దంకి నియోజకవర్గ నేతలు

యువతకు క్రీడలతో మానసిక ఉల్లాసం

చీరాలటౌన్, జనవరి 24 :నేటి యాంత్రిక జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసం అందిస్తాయని చీరాల ఆర్డీవో పాతకోట సరోజిని పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ అండ్‌పీఎం స్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర పోటీల సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి, ఎంపీడీవో నేతాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఈటీలు, సచివాలయాల సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 33 మంది ఎంపిక



క్యాంపస్ ఇంటర్యూలలో ఎంపికైన విద్యార్థులతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, జనవరి 24 : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం హెటిరో డ్రగ్స్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 33 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అక్రిడేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి. సుబ్బారావు, అడ్మిస్ట్రేషన్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర వర్ధంతి

చినగంజాం, జనవరి 24 : మండలంలోని గొనసపూడి గ్రామంలో పరిటాల రవీంద్ర 19వ వర్ధంతిని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పరిటాల పూజిత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రవీంద్ర, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయకులు వంకాయలపాటి అంజిబాబు, పరిటాల కృష్ణమూర్తి, పి.వెంకటనారాయణ, కనపర్తి వీరాస్వామి, నార్నే సత్యనారాయణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



పరిటాల రవీంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలి

అద్దంకిటౌన్, జనవరి 24: డీఆర్‌డీఏలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు సీఎంకు తెలియజేసి పరిష్కరించేలా చూడాలని బుధవారం పలువురు ఉద్యోగులు వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సెర్ప్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరికి ఆయా హోదాల ద్వారా పే స్కేల్ అ మలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అర్హులైన ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలన్నారు. కారుణ్య నియమాలకు చేపట్టాలని, పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డీఆర్‌డీఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాకానికి నివాళులు అర్పించిన కరణం

అద్దంకి, జనవరి 24: ప్రముఖ వ్యాపారి, టీడీపీ నేత కాకాని హనుమంతరావుకు పలువురు నివాళులు అర్పించారు. హనుమంతరావు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ చీరాల ఇంచార్జి కరణం వెంకటేష్ లు కాకాని హనుమంతరావు మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే హనుమంతరావు మృతదేహంపై శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు హాజరై నివాళులు అర్పించారు.



కాకాని హనుమంతరావు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 24: ఆర్టీసీ డిపో అధికారులు కార్మికుల వ్యతిరేక విధానాలు మానుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల అధికారుల నిర్లక్ష్యవైఖరికి నిరసనగా అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారంకు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో డ్రైవర్లు ఎస్. వెంకటేశ్వర్లు, కె. శ్రీనివాసరావు, ఎం. పిచ్చయ్య, కండక్టర్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొనగా పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు సంఘీభావం తెలియజేశారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు

'నాట్స్' సాయంతో చిల్లచెట్లు తొలగింపు

బల్లికురవ. జనవరి 24 : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో ప్రజల సమస్యలపై ఉత్తర అమెరికాలో ఉన్న తెలుగు సంఘం (నాట్స్) స్పందించింది. బుధవారం గ్రామంలోని చెరువు కట్టపై ఎంతో కాలం నుంచి చిల్లచెట్లు ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుంటుపల్లి గ్రామానికి చెందిన మాదాల వీరమ్మ కుమారులు రాజేంద్ర, సాంబయ్యల దృష్టికి తీసుకు వెళ్లగా వారు అమెరికాలో ఉన్న నాట్స్ సంఘం దృష్టికి తీసుకు వెళ్లి తుమ్మ చెట్లు తొలగించేందుకు అవసరమైన నిధులను వారు మంజూరు చేయించారు. దీంతో తుమ్మచెట్లను పూర్తి స్థాయిలో తొలగించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎంతో కాలం నుంచి ఉన్న సమస్య పరిష్కారం కావటంతో అంబడిపూడి గ్రామస్థులు నాట్స్ సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.



అంబడిపూడి చెరువు కట్టపై ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న తుమ్మ చెట్లు

పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచండి

పంగులూరు, జనవరి 24: గ్రామాలలో పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఎంపీడీవో రామాంజనేయులు సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛ సంకల్పంపై జరిగిన మాస్టర్ ట్రైనర్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. నివాసాల నుంచి గ్రీన్ అంబాసిడర్స్ ద్వారా సేకరించే వ్యర్థాలను క్రమం తప్పకుండా డంపింగ్ యార్డ్‌లకు తరలించాలన్నారు. సేకరించిన వ్యర్థాల నుంచి తడి, పొడి వాటిని వేరుచేసి సంపదగా మార్చే పద్ధతులను, వాటి వినియోగాన్ని ఐటీసీ ప్రతినిధి వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎంపిక చేసిన వలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్న ఐటీసీ ప్రతినిధి శ్రీనివాసరావు